సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్ష

- బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/వీణవంక/కమలాపూర్: రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వామని బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. హుజూరాబాద్‌రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్‌ని ఒప్పించి రూ.వెయ్యి కోట్లతో హుజూరాబాద్‌ని అభివృద్ధి చేస్తానని, సమస్యలు పరిష్కరిస్తానన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలో లేక మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్, మోటార్ల దగ్గర మీటర్లు పెడతామన్న బీజేపీ కావాలో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కౌశిక్‌రెడ్డికి ఓటేయాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 24, 14వ వార్డుల్లో కౌశిక్‌రెడ్డి సోదరుడు ప్రతీక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగారు. చెల్పూర్ పంచాయతీ పరిధి తోకలపల్లి గ్రామంలో ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి ప్రచారం చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు ఖాయమని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, బీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో హనుమాన్ టెంపుల్ చైర్మన్ బాబురావు, సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణామూర్తి, మాజీ ఎంపీటీసీ పంజాల సదానందం, నాయకులు, ఉన్నారు.


ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని కౌశిక్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట మండలం సైదాబాద్, మున్సిపల్ పరిధిలోని కృష్ణకాలనీ, శివాలయం సమీపంలోని, హుజూరాబాద్ రోడ్డులోని, కొత్తపల్లిలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ గెలిచినా ఢిల్లీ నాయకుల ముందు చేతులు కట్టుకోవడం తప్పదని అన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దేశాయిపల్లిలో ఎంపీపీ రేణుక ప్రచారం

హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే..

హుజూరాబాద్‌లో ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానేనని ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి అన్నారు. వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామంలో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వల్బాపూర్ గ్రామంలో పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ఇంటింటా ప్రచారం

కౌశిక్‌రెడ్డికి మద్దతుగా కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపాలి

- కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి

మానకొండూర్/శంకరపట్నం: అక్రమాలకు పాల్పడుతూ రూ.కోట్లు దండుకున్న బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలంలోని కరీంపేట, ఇప్పలపల్లి, తాడికల్ గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పథకాలు అమలు చేయకుంటే గల్లపట్టి అడగండని అన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రూ.2,500, రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తామని కాంగ్రెస్ గ్యారంటీలను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ డబుల్ బెడ్‌రూమ్, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, యువతకు నిరుద్యోగ భృతి అందించకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టాలన్నారు. పేదలకు భూములివ్వని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మాత్రం ఫామ్‌హౌజ్ వచ్చిందని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రసమయి బాలకిషన్‌ను చిత్తుగా ఓడించాలని కోరారు. ఈసమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ భైరి సంపత్, ఉపసర్పంచులు కుమార్, శ్రీనివాస్, మైనార్టీ జేఏసీ కన్వీనర్ రహీం, కోకన్వీనర్ ఆరీఫ్, సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా అధ్యక్షురాలు మల్లవ్వ, కవ్వంపల్లి అనురాధ, నాయకులు పాల్గొన్నారు. మానకొండూర్ మండలంలోని కొండపల్కల, మద్దికుంట గ్రామాల్లోని బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మద్దికుంట మాజీ సర్పంచ్ దువ్వాసి భూపతి, ఉపసర్పంచ్ బుర్ర శ్రీధర్, వార్డు సభ్యులు మల్యాల శంకరయ్య, ఎల్కపల్లి నర్సయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కెక్కర్ల శ్రీనివాస్, కొండపల్కల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాడ తిరుపతిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు సాయిలు, రాజయ్య, రెండు గ్రామాల నుంచి వంద మంది కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి కవ్వంపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.


కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న కవ్వంపల్లి

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్: నియోజకవర్గంలో పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టును ప్రారంభించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్: నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీశ్‌కుమార్

గౌడన్న మద్దతు సతీశ్‌కుమార్‌కే..

అక్కన్నపేట(హుస్నాబాద్): నియోజకవర్గంలోని గౌడ కులస్తులంతా బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ వెంట ఉంటారని గౌడసంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మగాని శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మగాని రాజేశం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కులం పేరుతో రాజకీయాలు చేసే నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎంపీగా ఉన్నప్పుడు గౌడ కులస్తులను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర మహిళా విభాగం చైర్మన్ పూదరి రాజేశ్వరి, నాయకులు అనురాధ, కుమారస్వామి, పర్శరాములు, శ్రీనివాస్, శ్యాం సుందర్‌గౌడ్, తాళ్లపెల్లి మల్లేశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేట: మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన

- కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/వీణవంక/కమలాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కోరుకున్న సుపరిపాలన సాధ్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. వీణవంక మండలంలోని వివిధ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు యోజకవర్గ అభివృద్ధిని మరిచారు. ఎమ్మెల్యేగా అవకాశమివ్వాలని కోరారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని పార్టీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఏముల పుష్పలత కోరారు. సభకు పీసీసీ చైర్మన్ రేవంత్‌రెడ్డి వస్తున్నారని, సభను విజయవంతం చేయాలని ఒడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం సాయంత్రం సభ ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు కోడం రజిత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ వొడితెల ప్రణవ్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రణవ్‌ను ఆశీర్వదించి గెలిపించాలని ప్రణవ్ తల్లి పద్మశ్రీ కోరారు. కమలాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రణవ్ ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు.


మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

అభివృద్ధి ఏంటో చూపిస్తా..

ఎమ్మెల్యేగా గెలిపించండి

సైదాపూర్: హుస్నాబాద్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా ఎమ్మెల్యేగా గెలిపించండి అని పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోని పనులే తప్పా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల అధికారంలో ఉన్న సతీశ్‌కుమార్ పైసా పని చేయలేదని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో వందల మంది విద్యార్థుల బలిదానాలు చూడలేక తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి కాంగ్రెస్‌కు ఓటేయాలని ప్రభాకర్ కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. ప్రభాకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అసమర్థుడని మంత్రి హరీశ్‌రావే అన్నారని పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని సోమారంలో మాట్లాడారు. సతీశ్‌కుమార్ ఎమ్మెల్యేగా ఉంటే హరీశ్‌రావు పని చేస్తానంటాడు. ఎమ్మెల్యే చేసే పని పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి చేస్తానంటే ఇక్కడి ఎమ్మెల్యే అసరమర్థుడు కాదా? అని అన్నారు. ఈసమావేశంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

విద్యార్థుల క్షేత్రసందర్శన

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని పారమిత పాఠశాల నాల్గో తరగతి విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా బుధవారం గోపాల్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. వరి, పత్తి తదితర పంటలు సాగు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏ భూముల్లో ఏ పంటలు పండుతాయనని, చెక్‌డ్యామ్‌ను పరిశీలించి నీటిలో నివసించే జీవరాశులను తెలుసుకున్నారు. ఇంటర్ డిసిప్లినరీ లర్నింగ్‌లో భాగంగా నేర్చుకున్న విషయాలను విద్యార్థులు నోట్‌బుక్‌లో రాసుకున్నారు. పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులను క్షేత్రపర్యటనకు తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, చైర్మన్ ఇ.ప్రసాద్‌రావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ దుర్గా భవానీ తెలిపారు. ఎలకతుర్తి మండలం జీలుగుల గ్రామానికి చెందిన వ్యక్తి హుజూరాబాద్ నుంచి బుధవారం మద్యం తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామని వివరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి అక్రమంగా మద్యం తరలింపు, నిల్వ చేసినా చర్యలు చేపడతామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ బాలబాలికలు ఈ నెల 19, 20 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్ 14–17 రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొన్నారు. అండర్ –14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన వై.అక్షయ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ందని, డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపల్ అర్చనప్రియదర్శిని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.


రాష్ట్రస్థాయిలో బహుమతి పొందిన వై. అక్షయ

నియామకం

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన విలాసాగరం పృథ్వీరాజ్ జాతీయ మానవ హక్కుల కమిటీ కరీంనగర్ జిల్లా శాఖ ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ తెలిపారు. ఈమేరకు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సుధాకర్ పృథ్వీరాజ్‌కు సూచించారు. అనంతరం నియామకానికి సహకరించిన జిల్లా నాయకత్వానికి పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.


పృథ్వీరాజ్

ఘనంగా సత్యసాయి బాబా జయంతి


టిఫిన్ బాక్స్, బాటిళ్లు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు హాజరై మాట్లాడారు. సత్యసాయి సేవా సమితి సేవభావంతో ప్రతీ ఒక్కరిలో సేవా గుణం పెంపొందించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ పారిశుద్య కార్మికులను సన్మానించి, టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బ్యాగ్‌లు అందించారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ సతీశ్‌కుమార్, సాయి సేవదళ్ సభ్యులు డాక్టర్ సత్యం, డాక్టర్ సావిత్రి, సత్యనారాయణ, ఉపేందర్, మహేందర్, శివకుమార్ పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- కరీంనగర్‌రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు
- హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి

చొప్పదండి: రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా, ఎవరికీ భయపడొద్దని కరీంనగర్‌రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు కోరారు. పట్టణంలో బుధవారం బీఎస్‌ఎఫ్, పోలీసులతో కవాతు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మార్కెట్ చౌరస్తాలో మాట్లాడారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తుగా బైండోవర్ అయినవారు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రవీందర్, ఇంద్రసేనారెడ్డి, రాజ్‌కుమార్, ఎస్‌ఐలు ఉపేంద్రచారి, తిరుపతి, అభిలాశ్, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో..

సైదాపూర్: మండల కేంద్రంలో పోలీస్ కవాతును బుధవారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సైదాపూర్ పాత బస్టాండ్ వద్ద మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇతర గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చి ప్రలోభాలకు, గురిచేసినా, గొడవలు చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా డబ్బులు, వస్తువులు ఇచ్చినా, పంచినా 1950, డయల్ 100 కాల్ చేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇలాంటి కేసుల్లో యువతకు భవిష్యత్‌లో ఎలాంటి ఉద్యోగాలు రావన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రతి పౌరుడు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


సైదాపూర్‌లో కవాతును ప్రారంభిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి


చొప్పదండిలో...

గంగాధర: ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్సై పుల్ల అభిలాశ్ సూచించారు. గంగాధరలో ఓటుహక్కు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 64 పోలింగ్ కేంద్రాలు, 40 లొకేషన్లలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు ఎవరైనా మాకే ఓటు వేయాలని బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయా పార్టీల నాయకులు సైతం ఎవరి ప్రచారం వారు చేసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టబద్దమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించిన పోలీసులు ఎన్నికల నియమావళిపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

శంకరపట్నం: మండలంలోని కరీంపేట, గద్దపాక గ్రామాల్లో బుధవారం బీఎస్‌ఎఫ్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలల్లో బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. దాదాపు 120 మందికి ప్యాడ్లు అందజేశామని ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి. సమ్మిరెడ్డి, డీఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎగ్జామ్ ప్యాడ్లు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు